పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల కేటగిరి-2 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ రెండో సెమిస్టర్ వన్ టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

నేడు పది విద్యార్థులకు అవగాహన సదస్సు

బన్సీలాల్‌పేట్, మార్చి 11: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఉచిత అవగాహన శిబిరం ఏర్పాటు చేశామని రెయిన్‌బో ఫౌండేషన్ సంధ్యారాణి తెలిపారు. బుధవారం చాచా నెహ్రూ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగే శిబిరంలో ఎడ్యుకేషన్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్, సైకాలజిస్ట్ ప్రొఫెసర్ పి.జ్యోతి రాజా అవగాహన కల్పించనున్నారు. పరీక్షలంటే భయమెందుకు, మానసిక ఒత్తిడి జయించడం, మెమోరీ టెక్నిక్స్, పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తారని తెలిపారు. శిబిరంలో బన్సీలాల్‌పేట్, బోయిగూడ, ఆదయ్య స్మారక పాఠశాలల విద్యార్థులు హాజరవుతారని ఆమె తెలిపారు.

కాలనీల్లో విపరీతమైన నీటిఎద్దటి

- మెరుగైన సరఫరాకు అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముషీరాబాద్ ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 11: కాలనీలు, మురికివాడల్లో విపరీతమైన నీటిఎద్దడి ఉందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే మండుటెండల్లో పరిస్థితి ఏమిటోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వేసవిలో మెరుగైన మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులకు ఆయన సూచించారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఆర్యసమాజ్‌గల్లీ, కుమ్మరిబస్తీ, శివాజీచౌక్ చౌరస్తా బస్తీల్లో మంగళవారం యువ నాయకుడు ముఠా జయసింహ, జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. తమ బస్తీలో టీజీఆర్‌ఐసీ పథకంలో భాగంగా చేపట్టిన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో రోడ్డు అధ్వాన్నంగా మరిపోయిందన్నారు. రోడ్డు తవ్వి నెల కావస్తున్నా పనులు జరగడంలేదని కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు ఆరోపించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే చర్యలు చేపట్టాలని ఆర్య సమాజ్ బస్తీవాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తెలంగాణ రీజనల్ ఇరిగేషన్ కార్పొరేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదని, వేరే కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. కలుషిత నీటి సరఫరా అవుతుందని, చర్యలు చేపట్టాలని కుమ్మరిబస్తీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలుషిత నీటి, లోప్రెజర్ సరఫరా సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డీజీఎం కార్తీక్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో కవాడిగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు చిత్రాల నగర్ శ్రీహరి, వల్లాల శ్రీనివాస్, సానెం చంద్రశేఖర్, రాజు, రవి, శివగౌడ్, కార్తీక్, వేణుయాదవ్, ప్రవీణ్‌గౌడ్, మహిళా నాయకులు రూప, మంజుల, బస్తీవాసులు పాల్గొన్నారు.

మోడల్ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఎమ్మెల్యే తలసానిని కలిసిన మోడల్ కాలనీ ప్రతినిధులు

అమీర్పేట్, మార్చి 11: సనత్ నగర్ డివిజన్ మోడల్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ ఈఈని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సనత్‌నగర్ డివిజన్ మోడల్‌కాలనీ రోడ్ల నిర్మాణ అంశాన్ని కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డి.బుచ్చిబాబు నేతృత్వంలో ప్రతినిధులు వీరభద్రరావు, శశికాంత్, రవీంద్ర బాబు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. మోడల్ కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్టు పనిచేయడం లేదని, లిఫ్ట్ పని చేయకపోవడం వల్ల వయోధికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ ఈఈని వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్ నగర్ డివిజన్లోని మోడల్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా, ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

క్రమశిక్షణతో కృషి చేస్తే విజయం తథ్యం

గ్రూప్స్‌లో మంచి మార్కులు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న విద్యావేత్త బాలలత

చిక్కడపల్లి, మార్చి 11: క్రమశిక్షణ పట్టుదల కృషి చేస్తే తప్పకుండా పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని ప్రముఖ విద్యావేత్త, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో సీఎస్‌బీ గ్రూప్స్ అభ్యర్థులు మంచి మార్కులు సాధించడంతో మంగళవారం గాంధీ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో బాలలత అభ్యర్థులను సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్థ నుంచి భారీ సంఖ్యలో అభ్యర్థులు ఉన్నత మార్కులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందులో మహిళలు, బలహీన వర్గాలకు చెందిన వారు ఉండడం చాలా సంతోషమన్నారు. ఉద్యోగాలు సాధించి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ముందుకు సాగాలని ఆమె కోరారు. అకాడమీ డైరెక్టర్ ఎం.ఉమేష్‌రెడ్డి, గ్రూప్స్ ఇన్‌చార్జి ఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిజ్ఞాస పరిశోధనాత్మక వ్యాసాల కార్యశాల

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఖజానా- లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర, సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 11: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యములో జిజ్ఞాస పరిశోధనాత్మక వ్యాసాల కార్యశాలను 15న నిర్వహించనున్నట్లు సంస్థఅధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్, సమన్వయకర్తలు నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి తెలిపారు. ఈ కార్యశాల పోస్టర్ మంగళవారం చిక్కడపల్లి లోని ఆ సంస్థ కార్యాలయంలో గోడపత్రికను రాష్ట్ర ఖజానా అండ్ లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యరీతుల్లోని వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి పరిశోధనా అంశాలను ఎట్లా ఎంపిక చేసుకోవాలి, పరిశోధనా పద్ధతులను వాడుతూ ప్రామాణిక పరిశోధనా వ్యాసాలను , సిద్ధాంత వ్యాసాలను రూపొందించుకునే విధానంపై ప్రముఖ నృత్యగురువు, అమెరికాలోని ఆర్యా విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ వేలూరి సుమిత్ర ఈ కార్యశాలను నిర్వహిస్తారని వారు వివరించారు.

కమ్యూనిటీ హాల్లో మౌలిక సదుపాయాలు

బేగంపేట్, మార్చి 11: బేగంపేట డివిజన్లోని పాటిగడ్డ కమ్యూనిటీ హాల్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినందుకు గాను సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కొంతకాలంగా పాటిగడ్డ కమ్యూనిటీ హాల్లో లైట్లు ఫ్యాన్లు లేకపోవడంతో అక్కడ శుభకార్యాలు చేసుకునేందుకు బస్తీవాసులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి స్థానిక బస్తీ నాయకులు బీఆర్ఎస్ నాయకులు శేఖర్ ముదిరాజ్ శ్రీనివాస్ గౌడు తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి కమ్యూనిటీ హాల్‌లో లైట్లు ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. దీంతో బస్తీవాసులు అందరూ హర్షం వ్యక్తం చేశారు.

కమ్యూనిటీ హాల్‌లో లైట్లు, ఫ్యాన్లు బిగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడం హర్షణీయం

హిమాయత్ నగర్, మార్చి11: అన్ని రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడం చారిత్రకమైన నిర్ణయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో యోగా సాధనలో డాక్టర్ అలివేలు మంగ, తదితరులు

కవాడిగూడ, మార్చి 11: యోగాతో సంపూర్ణణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ అలివేలు మంగ అన్నారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణా శిబిరంలో మంగళవారం వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అలివేలు మంగ మాట్లాడుతూ ఆయుష్ పథకంలో భాగంగా ప్రతి రోజూ రెండు గంటల పాటు ఆసుపత్రి ప్రాంగణంలో అనుభవజ్ఞులైన యోగా శిక్షకులతో యోగా సాధన చేస్తున్నామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఈ యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజలు యోగా శిబిరాన్ని సద్వనియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ నిఖిల్, ఆసుపత్రి పీహెచ్ఎన్ ఫిల్లీస్ ఏఎన్ఎం విజయకుమారి, ఆశా వర్కర్లు నాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

హిమాయత్ నగర్, మార్చి11: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కంటి, పంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం విపరీతంగా సెల్‌ఫోన్‌ను వినియోగించడం, రాత్రుల్లో సకాలంలో నిద్ర పోకుండా మేల్కొని ఉండటం, ఆహారపు అలవాట్ల వల్ల కంటి సమస్యలు ఉత్పన్న మవుతాయని తెలిపారు. విద్యార్థులతో పాటు చిన్నారులు, మహిళలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వాసన్ కంటి దవాఖాన వైద్య బృందం శ్రీకాంత్, నాగరాజు, వెంకట్, నవీన్, కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సత్యనారాయణరెడ్డి, డాక్టర్ రాపోలు శ్రీనివాస్, అధ్యాపకులు వై.ఉమ, సూర్యకుమారి, సీవీఎల్ నారాయణ, గంగాధర్, శ్రీనివాస్, ఆదాము, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

బొల్లారం, మార్చి 11: అనాథల చదువులకు తోడ్పాటు అందించడమే తమ సంఘం లక్ష్యమని చారిటీ సంస్థ ప్రతినిధి ఆశా కటారియా తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని క్లాసిక్ గార్డెన్‌లో హోలికే రంగ్-గింతికే సంఘ్‌లో భాగంగా మంగళవారం తంబోలా వేడుకలు నిర్వహించారు. మహిళలు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి అలరించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా మాట్లాడుతూ హోలీ సందర్భంగా వేడుకలు నిర్వహించామని పేర్కొన్నారు. సంస్థ ద్వారా పేద పిల్లలకు చదువు, వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కిరణ్ మఖాన, వందన, మంజు, నంద, అర్చన, సదాన, గీత, భాటియా, నవనీత, మోహిని కటారి, తదితరులు పాల్గొన్నారు.

15న నేషనల్ జూరిస్ట్స్ కాన్ఫరెన్స్

ఖైరతాబాద్, మార్చి 11: బ్రహ్మకుమారీస్ జూరిస్ట్స్ వింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 15న గచ్చిబౌలిలోని గ్లోబ్ పీస్ ఆడిటోరియంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నేషనల్ జూరిస్ట్స్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు విశ్రాంత హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో కార్యక్రమ బ్రోచర్లను బ్రహ్మకుమారీస్ ప్రశాంతి, రజనీ, అంజలి, కవితతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సదస్సులో జడ్జిలు, జుడిషియల్ అధికారులు, న్యాయవాదులు, టాక్స్, ఫైనాన్స్ నిపుణులు, న్యాయ కళాశాల ప్రొఫెసర్లు హాజరవుతారని తెలిపారు. ముఖ్యఅతిథులుగా సుప్రీం కోర్టు జడ్జి వెంకటనారాయణ భట్టి, తెలంగాణ హైకోర్టు జడ్జిలు విజయసేన్‌రెడ్డి, శ్రీసుధా, సూరేపల్లి నంద, లక్ష్మీనారాయణ అలిశెట్టి, త్రిపురా హైకోర్టు జడ్జి అమర్‌నాథ్ గౌడ్ హాజరవుతున్నారన్నారు.

దాయర మార్కెట్ రోడ్‌లో అధికారుల పర్యటన

మార్కెట్ పర్యటనలో సమస్యను పరిశీలిస్తున్న జలమండలి సీజీఎం ప్రభు

ముషీరాబాద్, మార్చి 11: రాంనగర్ డివిజన్ బాకారం, దాయర మార్కెట్ ప్రాంతాల్లో జలమండలి అధికారులు పర్యటించారు. రోడ్డును తవ్వి మరమ్మతులు మరచి శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన అధికారులు బురదమయంగా ఉన్న రోడ్డును పరిశీలించారు. రోడ్డుపై మట్టి, బురద పేరుకు పోవడానికి గల కారణాలను ఆరా తీశారు. డ్రైనేజీ లీకేజీ సమస్యకు పరిష్కారానికి చర్యలు చేపట్టారు. జలమండలి సిజిఎం ప్రభు, డైరెక్టర్ అమరేందర్ రెడ్డి డీజీఎం మోహన్ రాజ్ లు బురదమయంగా మారిన రోడ్డును పరిశీలించారు. జీహెచ్ఎంసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని, లీకేజీ సమస్యను వెంటనే పరిష్కరించనినట్లు తెలిపారు. ప్రైవేట్ వ్యక్తుల సంబంధించిన డ్రైనేజీ రోడ్డు పై పారుతుండడం వలన సమస్య తలచిందని తెలిపారు.

రామ్ రాజయ్య సేవలు ఎనలేనివి

చిక్కడపల్లి, మార్చి 11: కార్మికుల సంక్షేమ, కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన కార్మిక నేత రామ్ రాజయ్య అని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్మిక నాయకుడు రాజయ్య సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు ఐలన్న రాజయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల కార్మికుల కోసం నిరంతరం శ్రమించారన్నారు. సింగరేణి కార్మికుడిగా ఉద్యోగానికి రాజీనామా చేసి భవన నిర్మాణ రంగంలోకి వచ్చి అనేక సేవలు అందించారని అన్నారు. సభలో కోటంరాజు, ఉప్పు తాటికొండ మధు, వేములకొండ సంపత్, పిల్లి హరిచంద్ర, రామన్న, యాదగిరి, రాజేందర్ పేపర్, శ్రీనివాస్, వెంకటరమణ, ఈశ్వరచారి , వెంకటయ్య, అంజయ్య అనిల్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

మహిళలను సన్మానిస్తున్న పలువురు వక్తలు, ప్రతినిధులు

సికింద్రాబాద్, మార్చి11: నేటి ఆధునిక మహిళ స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తోందని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటోంది అని అమన్ వేదిక రెయిన్‌బో హోమ్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎల్లయ్య అన్నారు. నైటింగేల్ రెయిన్‌బో హోమ్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో వారసిగూడలోని నేతాజీ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ లెర్నింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ప్రతినిధి అంజలి మాట్లాడుతూ స్త్రీ శక్తి అసాధారణమైనదని, మహిళలు ఎక్కడ ఉన్నా అక్కడ అభివృద్ధి జరిగేలా చేస్తారని అన్నారు. ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ క్రాంతి కిరణ్, నమ్రత మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా, సమాజాన్ని మార్చే శక్తిగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ బేస్డ్ కేర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజు అధ్యక్షత వహించారు. మహిళలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. వేడుకలో ఉదయరాణి, కళావతి, పూజిత, ఝాన్సీ, మౌనిక, మంజుల, నాగమ్మ, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొని మహిళా సాధికారతపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

డిప్యూటీ మేయర్ ను సన్మానించిన మహిళలు

ఉస్మానియా యూనివర్సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమృద్ధి మహిళా మండలి ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలి రాష్ట్ర అధ్యక్షురాలు శామల రమణి, ప్రతినిధులు సుమిత్ర, శ్రీలత, రూత్ క్లేర్, అనురాధ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతను సన్మానిస్తున్న మహిళలు

అలరించిన లలిత సంగీత విభావరి

రచయిత డాక్టర్ ఎంకే రామును సత్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

ముషీరాబాద్, మార్చి 12: రసమయి సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన లలిత సంగీత విభావరి అలరించింది. గాయకులు శశికళాస్వామి, సురేఖమూర్తి, హిమబిందు, కె.రామాచారి ఆలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్రకుమార్ పాల్గొని కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, ఎం.నరసింహప్ప, బైసా దేవదాస్, పీవీ సాయిబాబా, ఆశాలత, రసమయి అధ్యక్షుడు డాక్టర్ ఎంకే రాము, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు.. పరువు హత్యలు చేసేవారికి గుణపాఠం

హిమాయత్‌నగర్, మార్చి 11: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ సెషన్ కోర్టు ఇచ్చిన తీర్పు కులదురంకారంతో పరువు హత్యలు చేసే వారికి ఒక గుణపాఠమని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్ల మూరి కృష్ణస్వరూప్ అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రణయ్ హత్య కేసులో దోషుల్లో ఒకరికి ఉరి, మిగిలిన వారికి జీవితఖైదు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించడంతో దళిత సమాజమంతా హర్షిస్తున్నదని అన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న దంపతుల పట్ల వారి తల్లిదండ్రులు, బంధువులు కుల వివక్షతో చూడకుండా మానవతా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేశ్, నగర అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుబ్బారావు, గ్రేటర్ మహిళా శాఖ అధ్యక్షురాలు బండారి లావణ్య, మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు బండారి లావణ్య, మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు రోజాలీల, రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ, నేతలు సత్యనారాయణ, హేమలత పాల్గొన్నారు.